జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజా జ్యోతి
ప్రతిఅక్షరం - ప్రజల కోసం

ఖమ్మం

బుధవారం 16
అక్టోబర్ 2024



# ఆదర్శ నగరంగా ఖమ్మం

## మరోసారి ముప్పు వాటిల్లకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం

## స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల



**ఖమ్మం**

రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా ఖమ్మాన్ని తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం 46వ డివిజన్ సారథిగనర్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.కోటితో చేపట్టిన స్మార్ట్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్నేరు వరద నుంచి మరోసారి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు రిటైనింగ్ వాల్ డిజైన్ కోసం నిపుణుల కమిటీని నియమించాలని ముఖ్యమంత్రిని కోరామని, భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ఆక్రమణలో ఉన్న పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలు మరోచోట అందించి.. వారిని అక్కడి నుంచి తరలించిన తర్వాతే ఆక్రమణలను తొలగించాలని మంత్రి సూచించారు. ఖమ్మం నగరానికి అవసరమైన నిధులు ముఖ్యమంత్రిని అడిగి తీసుకొస్తానని, పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోళ్లు నై!

- కొత్త పత్తి చేతికొస్తున్నా కనిపించని కేంద్రాలు
- ఖమ్మం మార్కెట్‌కు భారీగా పత్తి బస్తాల రాక
- ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతూ నష్టపోతున్న రైతులు
- క్వింటాకు రూ.500-700 వరకు నష్టం
- కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని రైతుల డిమాండ్

**ఖమ్మం**

జిల్లాలో వారం, పది రోజులుగా పత్తి పంట చేతికొస్తున్నా కొనుగోలు కేంద్రాల జాడ కనిపించడం లేదు. పంట సీజన్‌కు ముందుగానే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు. దీంతో మొదటి తీతను పూర్తి చేసిన రైతులు ఇంట్లో నిల్వ చేసుకోలేక తమ పంటను ప్రైవేటు వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది వానకాలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులకు ఏమాత్రం కలిసి రాలేదని - మిగతా3లో



# పంచాయతీలతోనే మెరుగైన పాలన

## రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## నూతన పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం


**బూర్గంపహాడ్**

గ్రామీణ ప్రజలకు పంచాయతీలతోనే మెరుగైన పాలన అందుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తాళ్లగొమ్మూరు పంచాయతీలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన పంచాయతీ భవనం, ఐటీసీ నిధులు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా నేరుగా పంచాయతీ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో - మిగతా3లో

# పెద్దమ్మ తల్లి ఆభరణాలు ఇప్పించాలి.

## ఆలయ కమిటీ సభ్యులు.

కారేపల్లి, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి: సింగరేణి మండల కేంద్రం కారేపల్లిలోగల పెద్దమ్మతల్లి ఆలయానికి గతంలో బాధ్యుడిగా వ్యవహరించిన మండేపూడి శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్ మండేపూడి రాణి దంపతుల వద్ద ఉన్న అమ్మవారి, ఆభరణాలు, అలంకరణ వస్తువులు ఇప్పించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం పెద్దమ్మతల్లి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ తరక నారాయణ, సభ్యులు మాట్లాడుతూ గత పది నెలల నుంచి మేము ఆలయ నిర్వహణ చేపడుతున్నామన్నారు. గతంలో ఆలయ భాద్యుడిగా ఉన్న మండేపూడి శ్రీనివాసరావు దంపతులు తమ వద్ద అమ్మవారి సామాను ఉంచుకున్నారని అనేకమార్లు అడిగిన ఇవ్వలేదని వాపోయారు. ఈ విషయమై సుమారు నాలుగు నెలల క్రితం కారేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా మండేపూడి శ్రీనివాసరావు స్వచ్ఛందంగా అమ్మవారి వస్తువులు ఇవ్వాలని లేని పక్షంలో పోలీసు అధికారులు జోక్యం చేసుకొని అమ్మవారి వస్తువులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తురక నారాయణ



సభ్యులు తురక రాంబాబు, పేరుని వెంకటేశ్వర్లు, తురక సాంబయ్య, పాశం నాగేశ్వరరావు, కేతిమాల శ్రీను, మైపా నరసింహ, పోతు నరసయ్య, తురక రవి, పెద్దమ్మ పుల్లయ్య ,చింతల సంపత్ కుమార్, పెద్దమ్మ శ్రీకాంత్, తురక రాజు ,పెద్దమ్మ సందీప్, కొండా అఖిల్ ,పందుల శంకర్, గంగారబోయిన విక్రమ్, ఉడతల సారంగపాణి, తురక కోటేశ్వరరావు, బోళ్ల కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి డీలరు అప్డేషన్ చేయించుకోవాలి..

## ఏడిఏ శ్రీనివాసరావు సూచన..

తల్లాడ, అక్టోబర్ 14 (ప్రజా జ్యోతి న్యూస్):వ్యవసాయ శాఖ తల్లాడ రైతువేదికలో వ్యవసాయ శాఖ, క్రిప్కో ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో సత్తుపల్లి, మధిర ఎరువుల అమ్మకాలు జరిపే ఎరువుల డీలర్స్ ఎరువుల లైసెన్స్ వివరాలు అప్డేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాస్ మిషన్ ద్వారా అమ్మకాలు జరిపే ప్రతీ డీలర్ అప్డేషన్ చేసుకోవాలని సూచించారు. ఎరువుల అమ్మకాలు దీని ద్వారానే జరపాలని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండి తాజుద్దీన్, క్విబ్ కో కంపెనీ సీనియర్ మేనేజర్ (హైదరాబాద్ )మునిరెడ్డి, మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.



## జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు.



కారేపల్లి, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి: సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలోని శ్రీలక్ష్మి ప్రియ కొటాక్ జిన్నింగ్ మిల్లులో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలుకు మంగళవారం అధికారులు సలహాలు చేస్తున్నారు.గతంలో ఇదే మిల్లు ద్వారా పత్తి కొనుగోలు చేసిన అధికారులు ఈ ప్రాంత రైతుల సౌకర్యార్థం ఈ ఏడాది కూడా పత్తి కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నారు.రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ 7521 లతో పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంబంధిత తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## బహుజన సేవాసమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ..



వ్యవస్థాపకులు బాలకృష్ణ చేతుల మీదుగా అందజేత..

తల్లాడ, అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి న్యూస్): లిబహుజన సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తల్లాడలోని మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వీటిని వ్యవస్థాపక అధ్యక్షులు మోదుగు బాలకృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లాడ మండలంలో తమ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చలికాలం నేపథ్యంలో వారికి దుప్పట్లు పంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కే. కోటేశ్వరరావు, బోనాసి శ్రీనివాసరావు, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డి.యస్సిలో పేరువంచ వాసికి ఎస్జిటి గా ఉద్యోగం




కల్లూరు అక్టోబర్ 15(ప్రజా జ్యోతి): మండల పరిధిలోనీ పేరువంచ గ్రామ పంచాయతీ కి చెందిన వెలిశాల సంధ్యారాణి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన డీఎస్సీ ఫలితాలలో మంచిర్యాల జిల్లా నుండి 80 వ ర్యాంక్ తో యస్.జి.టి గా అర్హత సాధించారు. ఆమె 2013-2015 లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసారు.అనంతరం అవనిగడ్డ లో కోచింగ్ తీసుకొని అప్పటి డి. యస్.సి లో సెలెక్ట్ కాకపోవడంతో మరింత పట్టుదలతో ఉన్న విషయాన్ని భర్త వెంకట కృష్ణ గమనించి ఆమెను ప్రోత్సహించడం జరిగింది.ఆమె పట్టుదల భర్త ప్రోత్సాహం మరింత తోడైంది.2024 డి.యస్.సి ని ఇంటి వద్ద ఉండి కష్టపడి చదివి మంచిర్యాల జిల్లా లో పరీక్ష రాసి 80 వ ర్యాంక్ సాధించి యస్.జి.టీ గా రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉద్యోగం అర్హత పత్రాన్ని అందుకున్న సంధ్యారాణికి,భర్త అశ్వారావుపేట ఫైర్ శాఖలో ఉద్యోగం చేస్తున్నందుకు ఆ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలని గ్రామస్తులు బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.ప్రోత్సహించిన అత్తమామలకు, తల్లిదండ్రులకు,భర్త వెంకటకృష్ణకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

# బాణసంచా దుకాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి




## కారేపల్లి సిఐ, ఎస్ఐ.

కారేపల్లి, అక్టోబర్ 15, ప్రజా జ్యోతి: సింగరేణి మండలంలో బాణసంచా దుకాణాలు పెట్టుకోదలచిన వ్యాపారులు అక్టోబర్ 25 తేది సాయంత్రం లోపు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని కారేపల్లి రూరల్ సీఐ,బి. తిరుపతిరెడ్డి, ఎస్సై ఎన్. రాజారాం లు అన్నారు. కారేపల్లి లో మంగళవారం వారు మాట్లాడుతూ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, పంచాయితీ శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు, టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ధరఖాస్తుతో పాటు AE-5 ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్ , చలానా రిసీప్ట్,. ఆధార్ కార్డ్ , ఫోటో జతపరచి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు .అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దీపావళి పండగ సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# చేపల చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం







కల్లూరు అక్టోబర్ 15(ప్రజా జ్యోతి): పట్టణ పరిధిలోని పెద్ద చెరువుకి వెళ్లే మార్గంలో పుల్లపుకుంట చేపల చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం.కల్లూరు నుండి రాళ్ల బంజరు వెళ్లే మార్గంలో కల్లూరు పెద్ద చెరువుకు సమీపంలోని పుల్లపుకుంట చేపల చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి పోలీస్ సిబ్బందితో సహా చేరుకున్న ఏసీబీ రఘు మహిళ మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.చేపల చెరువులో తల ముఖ భాగంలో చర్మం లేకుండా పుర్రె మాత్రమే కనబడుతూ గుర్తించటానికి వీలుకాని స్థితిలో చీర గాజులతో వున్న గుర్తు తెలియని మృతురాలిని గురించి చుట్టుపక్కల స్టేషన్ లో మిస్సింగ్ కేసుల్ని పరిశీలిస్తామని వివరాలు లభించకపోతే మీడియా ద్వారా ప్రచారం చేసి మృతి చెందిన మహిళ గురించి తెలుసుకుంటామని అలాగే డిఎన్ఏ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపుతామన్నారు కల్లూరు ఎసిపి రఘు అన్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## బాణసంచా దుకాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఎస్సై షాకీర్





కల్లూరు అక్టోబర్ 15(ప్రజా జ్యోతి) : మండలంలో బాణసంచా దుకా ణాలు పెట్టుకోదలచిన వ్యాపారులు అక్టోబర్ 25 తేది అని పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కల్లూ రు ఎస్సై షాకీర్ తెలియజ ేశారు.అక్టోబర్ 25 సాయంత్రం లోపు పోలీస్ కమిషనర్ కార్యాల యానికి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకొని,అనుమతి పొందాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పత్రిక ప్రకటనలో తెలిపారని తెలియజేశారు.దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.పోలీస్ శాఖ,నగర పాలక శాఖ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు, టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ధరఖాస్తుతో పాటు ఏఈ-5 ఫామ్,సెల్ఫ్ అఫిడవిట్, చలానా రిసీప్ట్,ఆధార్ కార్డ్,ఫోటో జతపరచి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలి.అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా,తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

## బుర్ర, మమతా బాలు దాతృత్వం.



పాలేరు అక్టోబర్ 15 ప్రజాజ్యోతి : మండలం లోని తురకగూడెం గ్రామం లో మంగళవారం ఉదయం అనారోగ్యంతో మరణించిన భూతం వీరాబాబు విషయాన్ని తెలుసుకున్న కూసుమంచి మండల కాంగ్రెస్ నాయకురాలు బుర్ర మమత బాలు మృతదేహాన్ని సందర్శించి అనంతరం దహన ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు 3000 రూపాయలను ఆర్థిక సహకారం అందించారు. మృతునికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటీవల కాలంలో తురక గూడెం గ్రామంలో పలువురికి బుర్ర. మమతా బాలు నేతృత్వంలో ఆర్థిక సహాయ సహకారాలు చేస్తూ గ్రామ అభివృద్ధికి పాటుపడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు . ఇటీవల కాలంలో గ్రామంలో రహదారి సమస్య ఉండగా తమ సొంత ఖర్చులతో ముండ్ల చెట్లను తొలగించి రహదారి సమస్యలు తీర్చారు. మంగళవారం నాడు తురకగూడెం గ్రామంలో పరామర్శ కార్యక్రమంలో బుర్ర మమతా బాలు వెంట పాల్గొన్న గ్రామ కాంగ్రెస్ యువజన నాయకులు బాలకృష్ణ, ఉదయ్,వెంకటేష్ శ్రీను,వెంకన్న, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## దేశ హితం కోసం బిజెపిలో చేరండి.... తాండ్ర, నంబూరి.




సత్తుపల్లి అక్టోబర్15 ప్రజా జ్యోతి.: పట్టణంలో పట్టణ అధ్యక్షుడు ఆచంట నాగ స్వామి ఆధ్వర్యంలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు ,పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు తో కలిసి బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం పట్టణంలోని వ్యాపారస్తులను, దుకాణదారులను కలుసుకొని బిజెపి సభ్యత్వ నమోదు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలు భారతీయ జనతా పార్టీని, ఒక రాజకీయ పార్టీల కాకుండా, ఈ దేశాన్ని అత్యున్నతకు తీసుకెళ్లే పార్టీగా భావిస్తున్నారని, భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో ముందుందని, ప్రపంచ దేశాలకు భారత సంస్కృతికి, సాంప్రదాయాలను అలవాటు చేస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రపంచ గురువుగా భారతదేశం నిలుస్తుందని తెలియజేశారు. అలాంటి పార్టీలో ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకొని దేశ హితం కోరే వారిగా ఉండాలని సత్తుపల్లి ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, మైనారిటీ నాయకుడు రెహమతుల్లా ,మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, మిట్టపల్లి నాగరాజు, మంద శివ, బానోతు విజయ్, తెనాలి అశోక్ కుమార్, ఈడ గణేష్ గౌడ్,కార్తీక్ యాదవ్ పాల్గొన్నారు

## ఖమ్మం ఇరిగేషన్ ఎస్ఈ గా మంగళంపూడి వెంకటేశ్వర్లు

### ఉత్తర్వులు జారీ చేసిన ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ అడ్మిన్



పాలేరు అక్టోబర్ 15 ప్రజాజ్యోతి : ఖమ్మం ఇరిగేషన్ ఎస్ఈగా మంగళంపూడి వెంకటేశ్వర్లు పూర్తి బాధ్యతను స్వీకరిస్తున్నట్లు ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ అడ్మిన్ అనిల్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఈ నర్సింగరావు సెలవులపై వెళ్లడంతో ఇరిగేషన్ ఈఈ గా విధులు నిర్వహిస్తున్న మంగళంపూడి వెంకటేశ్వర్లకు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## ఘనంగా రామ సహాయం నరేష్ రెడ్డి జన్మదిన వేడుకలు.



తిరుమలాయపాలెం, అక్టోబర్ 15, ప్రజా జ్యోతి :జిల్లా కాంగ్రెస్ నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, నాయకులు తిరుమలాయపాలెం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పాలేరు నియోజకవర్గం మహమ్మదాపురం సుబ్లేడ్ క్రాస్ రోడ్ నందు మంగళవారం మండల స్థాయి నాయకులు నరేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. కార్యకర్తలు నరేష్ రెడ్డికి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వోర వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రాజేష్ మోరపాక నాగన్న, కట్యారి శ్రీనివాసరెడ్డి, ఇందుర్తి మధుసూదన్ రెడ్డి, గుగులోతు గణేష్, వీర కుమార్ లాయర్, బోడా అశోక్, బోడ అజయ్, బోడ మోహన్, భూక్య రమేష్, బోడపట్ల శ్రీను, బోడపట్ల ఉపేందర్, బోడ రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీలతోనే మెరుగైన పాలన

-మొదటిపేజీ తరువాయి

పౌష్టికాహారంతోపాటు సకల సౌకర్యాలు అందుతున్నాయని అన్నారు. తొలుత మోరంపల్లిబంజరకు చేరుకున్న మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. మణుగూరు క్రాస్ రోడ్ వద్ద కూడా ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్సైలు రాజేష్, కిన్నెర రాజశేఖర్, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్ శర్మ, ఐసీడీఎస్ సీడీపీవో రేవతి, పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వర్లు, ఐటీసీ హెచ్ఆర్ హెడ్ శ్యామ్‌కిరణ్, అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, ఈవో మహేశ్, పంచాయతీ కార్యదర్శి తలగాని మురళి పాల్గొన్నారు.

## బెట్టింగ్‌లు ,ఆన్లైన్ గేమ్స్‌లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్న యువకులు

**ఇబ్రహీంపట్నం:** చదువుకున్న యువకులు బెట్టింగ్ లు ,ఆన్లైన్ గేమ్స్ లకు బానిసలై దొంగతనాలకు పాల్పడు తుండగా పోలీసులు పట్టుకొని రిమాండ్ కు తరలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం రామన్నగూడెం కు చెందిన ఉటుకూరి ప్రభాస్ తాత్కాలికంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ లో ఉంటూ కరీంనగర్ లో బీటెక్ చదువుతూ ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడి లాస్ అయ్యాడు, మరొకరు నల్గొండ జిల్లా శాలిగౌరారం గ్రామానికి చెందిన గుండ్లపల్లి శివ మెడికల్ షాప్ వర్కర్ గా పనిచేస్తూ ఆన్లైన్ బెట్టింగ్ ఆడుతూ లాస్ అయ్యాడు. వీరిద్దరూ ఒకరికొకరు ఆన్లైన్ ఇన్స్టా గ్రామ్ లో పరిచయమయ్యారు. సులభమార్గంలో డబ్బులు సంపాదించడం కోసం చోరీ చేయాలని నిర్ణయించు కున్నారు.

# కొనుగోళ్లు నై!

-మొదటిపేజీ తరువాయి

చెప్పొచ్చు. భారీ వర్షాలు, వరదలతో ఒకవైపు పంటలు దెబ్బతినగా, మరోవైపు పంటలను చీడపీడలు ఆశించడంతో దిగుబడులపై ప్రభావం చూపింది. దీంతో మిర్చి తోటలు, వరి పొలాలతోపాటు అక్కడక్కడా పత్తి కాయలు రాలిపోవడం, దూది రంగు మారడంతో భారీగా నష్టం వాటిల్లింది. జిల్లాలో ఈ ఏడాది రైతులు 2 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దాని ద్వారా దాదాపు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

**కొనుగోళ్లపై సమీక్షలతోనే సరి..**

జిల్లాలో పత్తి పంట దిగుబడిని బట్టి కొనుగోళ్ల కోసం ఇప్పటికే పలుమార్లు సీసీఐ కేంద్రాలు, కావాల్సిన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులు జిల్లాస్థాయిలో సమీక్షలు నిర్వహించారు. అయితే అధికారులు ఊహించినదాని కంటే ముందుగానే అంటే.. గడిచిన పక్షం రోజులుగా రైతులు పత్తి పంటను విక్రయానికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లాలో అడపా దడపా కురుస్తున్న అకాల వర్షాలు, తేమ శాతం లేదా మరే కారణమోగానీ ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఈ ఏడాది వివిధ మార్కెట్ల పరిధిలో ఉన్న తొమ్మిది జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు సైతం అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే ప్రైవేట్ ఖరీదుదారులు పత్తి పంటను భారీగా కొనుగోలు చేస్తున్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్ యార్డుకు పత్తి పంటను తీసుకొచ్చిన రైతులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ పంటను దళారులకు విక్రయించాల్సి వస్తున్నది. అప్పు చేసి సాగుకు పెట్టుబడి పెట్టిన రైతులు వడ్డీలు కట్టలేక చేతికొచ్చిన పంటను వెంటనే అమ్ముకోవాల్సి వస్తున్నది. దీనిని ఆసరా చేసుకున్న దళారులు అందిన కాడికి రైతులను దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

**విక్రయానికి 3 వేల బస్తాల రాక..**

ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల పత్తి యార్డుకు ఆయా మండలాలకు చెందిన రైతులు మంగళవారం రికార్డు స్థాయిలో 3 వేల పత్తి బస్తాలను విక్రయానికి తరలించారు. ఈ ఏడాది సీసీఐ క్వింటా పత్తికి మద్దతు ధర రూ.7,500 నిర్ణయించగా.. ఉదయం జరిగిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో క్వింటా గరిష్ఠ ధర రూ.7 వేలు పలికింది. మధ్య ధర క్వింటాల్ రూ.6,700 కాగా, కనిష్ఠ ధర రూ.5,500గా నిర్ణయించి ప్రైవేట్ ఖరీదుదారులు పత్తిని కొనుగోలు చేశారు. అదే.. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తే క్వింటాకు రూ.500 నుంచి రూ.700 వరకు అదనంగా రైతులకు ధర లభించే అవకాశం ఉంది. ఇప్పటికైనా సీసీఐ అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని ఆయా మండలాలకు చెందిన పత్తి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం..**

సీసీఐ కేంద్రాలను ప్రారంభించడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ఏర్పాటు చేయనున్న కేంద్రాలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ కార్యక్రమం నడుస్తున్నది. కేంద్రాల్లో పూర్తి మౌలిక వసతులు ఏర్పాటు చేసి రెండు, మూడు రోజుల్లో కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. పత్తిని పూర్తిగా ఆరబెట్టుకొని నాణ్యమైన కేంద్రాలకు తరలిస్తే మంచి ధర పొందే అవకాశం ఉంటుంది.

## సిఎంఆర్ లక్ష్యాలను నూరు శాతం సాధించాలి



**భూపాలపల్లి :** సి.ఎం.ఆర్ లక్ష్యాలను నూరు శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మిల్లర్లను ఆదేశించారు మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సి ఎం ఆర్, ఖరీఫ్ దాన్యం కేటాయింపు, మిల్లులు ట్యాగింగ్, మార్కెట్ కమిటీ లైసెన్సులు తదితర అంశాలపై పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార శాఖ, రైస్ మిల్లర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సి ఎం ఆర్ లక్ష్యం 77.46 శాతం పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సి ఎం ఆర్ ప్రక్రియపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు మిల్లర్లు మార్కెట్ కమిటి లైసెన్స్ పొందాలని అన్నారు. మిల్లర్లు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ధాన్యం సేకరణ, బియ్యం సరఫరా సక్రమంగా జరుగుతుందని ఆయన అన్నారు. సి.ఎం.ఆర్ లక్ష్యాలను సాధించడం చాలా ముఖ్యమని, ప్రభుత్వానికి సహకరించడం ద్వారా రైతుల ప్రయోజనాలను కాపాడగలరని కలెక్టర్ తెలిపారు. సి ఎం ఆర్ లో పాల్గొనే ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా రెండు వేర్వేరు రిజిస్టర్లను నిర్వహించాలని అన్నారు. ఏ సమయంలోనైనా పరిశీలనకు అందించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు గురించి మాట్లాడుతూ ట్యాగ్ చేయని కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం స్వీకరించొద్దని, కేటాయించిన మేరకు మాత్రమే ధాన్యం స్వీకరించాలని తెలిపారు. సన్న రకం, దొడ్డ రకంలో జాగ్రత్తలు పాటించాలని, టోకెన్ కేటాయించాలని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయడానికి తగినంత స్థలంతో పాటు దిగుమతి చేసేందుకు హమాలీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు, మార్కెటింగ్ డిఎం కనక శేఖర్, సహకార అధికారి వాలియా నాయక్, రైస్ మిల్లర్ల సంగం అధ్యక్షులు తిరుపతి, రైస్ మిల్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.